మండల కేంద్రాల్లో బీఆర్ఎస్‌కే ఆధిక్యం

బోథ్, డిసెంబర్ 5: బోథ్ నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ తన ఆధిక్యాన్ని చాటుకుంది. వెలువడిన ఫలితాల్లో బీజేపీ, కాంగ్రెస్ కంటే ఎక్కువ ఓట్లు సాధించింది. భీంపూర్ మండల కేంద్రంలో పోలైన 868 ఓట్లకు గాను బీఆర్ఎస్ అభ్యర్థి జాదవ్ అనిల్‌కు 361, కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్‌కు 137, బీజేపీ అభ్యర్థి సోయం బాపురావుకు 336 ఓట్లు వచ్చాయి. తాంసిలో 1926 ఓట్లకు గాను బీఆర్ఎస్‌కు 761, కాంగ్రెస్‌కు 545, బీజేపీకి 504, తలమడుగులో 1952 ఓట్లకు గాను బీఆర్ఎస్‌కు 1047, కాంగ్రెస్‌కు 462, బీజేపీకి 302, గుడిహత్నూర్‌లో 3886 ఓట్లకు గాను బీఆర్ఎస్‌కు 1650, కాంగ్రెస్‌కు 277, బీజేపీకి 1304, సిరికొండలో 1605 ఓట్లకు గాను బీఆర్ఎస్‌కు 987, కాంగ్రెస్‌కు 291, బీజేపీకి 263, బజార్‌హత్నూర్‌లో 2658 ఓట్లకు గాను బీఆర్ఎస్‌కు 1218, కాంగ్రెస్‌కు 422, బీజేపీకి 799, నేరడిడొండలో 2205 ఓట్లకు గాను బీఆర్ఎస్‌కు 1241, కాంగ్రెస్‌కు 319, బీజేపీకి 542, ఇచ్చోడలో 6136 ఓట్లకు గాను బీఆర్ఎస్‌కు 3249, కాంగ్రెస్‌కు 1230, బీజేపీకి 1622, బోథ్‌లో పోలైన 6190 బీఆర్ఎస్‌కు 2749, కాంగ్రెస్‌కు 1109, బీజేపీకి 2007 ఓట్లు వచ్చాయి. అర్నీ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి జాదవ్ అనిల్ తన ఆధిక్యతను చాటుకున్నారు.

పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, డిసెంబర్ 5: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లను బుధవారం నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి దేవన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగ్‌జాం తుఫాన్ మూలంగా వర్షం కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినందున సీసీఐ అధికారుల సూచన మేరకు బోథ్, పొచ్చెర, సొనాల కేంద్రాల్లో కొనుగోళ్లు ఉండవని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నగేశ్

బోథ్, డిసెంబర్ 5 : కొత్తపల్లి గ్రామంలో పీఏసీఎస్ డైరెక్టర్ కనక శ్యాంరావ్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మంగళవారం మాజీ ఎంపీ నగేశ్ పరామర్శించారు. అలాగే బోథ్ దవాఖానలో అనారోగ్యంతో బాధపడుతున్న మడాలి లాలీబాయి, మడావి జంగుబాయిను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ విజయ్, ఎంపీటీసీ జుగాదిరావ్, ఇమ్రాన్, సత్యనారాయణ, బాపురావ్, లక్ష్మణ్, శ్రీను ఉన్నారు.

అయ్యప్ప స్వాములకు ముస్లిం యువకుడు భిక్ష

అయ్యప్ప దీక్షాపరులతో కలిసి పూజ చేస్తున్న అబ్దుల్ రవూఫ్

బోథ్, డిసెంబర్ 5: మండలంలోని కౌర (బీ) గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు అబ్దుల్ రవూఫ్ మతాలకతీతంగా మంగళవారం అయ్యప్ప స్వామి దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. స్వాములతో కలిసి పూజలు చేశారు.

వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, డిసెంబర్ 5 : మహిళలు వృత్తి నైపుణ్య కోర్సులు నేర్చుకు నేల ప్రోత్సహించాలని డీఐసీ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో కేంద్ర వృత్తి నైపుణ్య అభివృద్ధి మంత్రిత్వ శాఖ జన శిక్షణ సంస్థ పాలకవర్గ సమావేశాన్ని సంస్థ చైర్మన్ పిట్ల మమత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఈవో ప్రణీత, ఎల్‌డీఎం భాస్కర్‌ప్రసాద్ హాజరయ్యారు. సమావేశంలో జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రస్తుతం అమలవుతున్న శిక్షణ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇది వరకు పూర్తి చేసుకున్న కోర్సు వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో సేడ్స్ సంస్థ డైరెక్టర్ ఆర్ సురేందర్, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ చెన్నాల రాజన్న, సభ్యులు శశికళ, మసూద్, డాక్టర్ చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేలను సంరక్షించుకోవడం అందరి బాధ్యత

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్

ఎదులాపురం : మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వై ప్రవీణ్ కుమార్

ఎదులాపురం, డిసెంబర్ 5 : ప్రస్తుత పరిస్థితుల్లో నేల సారవంతం కోల్పోయి, నిస్సారమైన పంటలలో దిగుబడులు తగ్గుతున్నాయని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వై ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నేలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల సారవంతత పెంపొందించుకోవాలంటే సేంద్రియ ఎరువుల వాడకం, పచ్చిరొట్టె ఎరువుల వాడకం, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. చెరువు మట్టి వాడకం వంటి పద్ధతులను పాటించాలని సూచించారు. ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం రైతులకు డ్రిప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్లు రాజశేఖర్, మోహన్‌దాస్, ఎం సునీల్ కుమార్, శివచరణ్, మమత, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ మృతిక దినోత్సవం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 5 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో మంగళవారం వృక్షశాస్త్రం శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అచిత్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు తమవంతు పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా తెలుగు అధ్యాపకుడు రాడపు సంతోష్ మాట్లాడుతూ నేలతో మనిషి జీవనం ముడిపడి ఉన్నదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జాకీర్, అధ్యాపకులు ప్రతాప్, రఘునాథ్, విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోడ్ ప్రోగ్రాం ఆఫీసర్ దయాకర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వాఘపూర్ సబ్ సెంటర్ తనిఖీ

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబర్ 5 : ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వాఘపూర్ సబ్ సెంటర్‌ను ఈ నెల 15న ఎన్క్వాస్ ఢిల్లీ బృందం పరిశీలించనున్న నేపథ్యంలో పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్ మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్, రికార్డులు, సబ్ సెంటర్‌లో కావాల్సిన పరికరాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది సురేశ్, బొమ్మెత సుభాష్, రోజారమణి, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్

ప్రతి ఒక్కరికీ అభినందనలు

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను శాలువాలతో సన్మానిస్తున్న ఎంపీపీ ఆడా చంద్రకళ -రాజేశ్వర్

నార్నూర్, డిసెంబర్ 5 : ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కోవలక్ష్మి గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ గాదిగూడ ఎంపీపీ ఆడా చంద్రకళ-రాజేశ్వర్ అభివందనలు తెలిపారు. మంగళవారం గాదిగూడలో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను శాలువాలతో సన్మానించారు. మిఠాయిలు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గాదిగూడ మండలంలోని ప్రజలు కోవలక్ష్మికి ఓటు వేసి గెలిపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఎన్నికల్లో ఇలాగే ఐక్యమత్యంతో అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మర్సివనే యోగేశ్, సర్పంచ్ మెస్రం జైవంత్‌రావ్, మాజీ ఎంపీటీసీ తుక్కుబాయి, నాయకులు ఆత్రం వామన్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థుల ప్రతిభ

సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్న జిల్లా విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 5 : హైదరాబాద్‌లోని బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అనే అంశంలో రాష్ట్రస్థాయి ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ దర్శన్ కుమార్ ఆదిలాబాద్ జిల్లా నుంచి సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్, ఎల్ శ్రావణి ఎంజేపీ(బాలికల) ఇదుల్లా సావర్గాం, సాయి తేజస్విని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిష్ హై స్కూల్ ప్రదర్శన ఇచ్చారు. పర్యావరణ హితం కోసం వ్యర్థ పదార్థాల వినియోగం, సామాజిక స్థితి గతుల మార్పు, నిర్వహణ అనే అంశంపై విద్యార్థులు విశ్లేషణ అందించారు. రాష్ట్రస్థాయిలో పాల్గొన్న విద్యార్థులు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత అభినందించారు. వారి వెంట జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, ఎన్‌సీఎస్‌సీ జిల్లా అకాడమిక్ కో ఆర్డినేటర్ భాస్కర్, గైడ్ టీచర్స్ వినోద్, సుశాంత్‌రెడ్డి, రత్నబాయి పాల్గొన్నారు.

కైలాస్‌టెక్డీ ఆలయ వార్షికోత్సవం

బోథ్, డిసెంబర్ 5: మండలంలోని నిగిని అటవీ ప్రాంతంలోని కైలాస్ టెక్డీపై కొలువైన నర్మదేశ్వర ఆలయ 21వ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకుడు శ్రీ సంత్ లింబాజీ మహారాజ్ కలశ స్థాపన పూజలు నిర్వహించి వార్షికోత్సవాలను ప్రారంభించారు. అనంతరం మహాలింగం, నంది తదితర వాటికి అభిషేకాలు, పూజలు చేశారు. మొదటి రోజున నిగిని, బాబేర, కంటేగాం, మర్లపెల్లి, బోథ్‌తోపాటు మహారాష్ట్రలోని నిగిని, ఇస్లాపూర్, దయ్యల్ దన్నూర్, సారంగాపూర్ భక్తులు వచ్చి మహాదేవుడిని దర్శించుకున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఎదులాపురం,డిసెంబర్ 5 : 2024 సంవత్సరంలో హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తెలిపారు. పట్టణంలోని భుక్తాపూర్‌లోని కార్యాలయంలో ప్రయాణికుల వివరాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా పొందుపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9849214764, 9394354477 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి

ఎదులాపురం, డిసెంబర్ 5 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిసి వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బౌద్ధ ఉపాసకు, ఉపాసికులు అంబేద్కర్ వాదులు, కుల సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద్, కోశాధికారి వాగ్మారే కాంతారావు, కార్యదర్శి అన్నారావు, జిల్లా ఉపాధ్యక్షులు కుషువార్తబాయి, తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి, డిసెంబర్ 5: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించే అంబేద్కర్ వర్ధంతిని జయప్రదం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 10గంటలకు నివాళులర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివరావాలని కోరారు.